నిర్వీర్యం దిశగా ప్రభుత్వ పాఠశాలలు

జి. కొండూరు/ నూజివీడు/ తిరువూరు: మైలవరం, నూజివీడు, తిరువూరు నియోజకవర్గాల్లో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. విద్యా కానుక కిట్లను పూర్తి స్థాయిలో పలుచోట్ల ఇప్పటివరకు పంపిణీ చేయ లేదు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఇలాంటి ఘటనలు చూస్తుంటే కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తుందా అనే అనుమానాలు కలుగక మానడం లేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు ప్రస్తుత ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఇంటర్ వరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించిన తల్లిదండ్రులు తల్లికి వందనం సొమ్ము అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించాల్సి రావడం, పిల్లలకు అవసరమైన విద్యోపకరణాలను సైతం అధిక ధరలకు కొనాల్సి రావడంతో తల్లిదండ్రులు ఆర్థికంగా నరకయాతన పడుతున్నారు.

ఈ ఏడాది తగ్గిన విద్యార్థుల సంఖ్య

పలుచోట్ల అందని విద్యా కానుక కిట్‌లు





నూజివీడులోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్); జి.కొండూరు ప్రభుత్వ పాఠశాలలో అందజేసిన స్కూల్ బ్యాగ్‌లు (ఫైల్)

తగ్గిన విద్యార్థుల సంఖ్య..

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొత్తం 172 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గత ఏడాది కన్నా ఈ ఏడాది 1,393 మంది విద్యార్థుల సంఖ్య తగ్గింది. విద్యా కానుక కిట్‌లు సైతం వంద శాతం అందించలేకపోయారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఇంకా 105 మందికి విద్యా కానుక కిట్‌లు అందలేదు. పలు చోట్లు మధ్యాహ్న భోజనం అమలులో సైతం నాణ్యత లోపిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నూతన విద్యార్థులకు అందని స్టూడెంట్ కిట్లు

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్‌ల పంపిణీ పూర్తిగా జరగలేదు. నూతనంగా చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, డ్రెస్, షూస్ అందలేదు. నాలుగు మండలాల్లోని హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్ విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదు. 50 శాతం విద్యార్థులకు మాత్రమే పాఠ్యపుస్తకాలు అందజేశారు. కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇంకా పాఠ్యపుస్తకాలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటికి తోడు విద్యార్థుల అభివృద్ధి కోసం తీసుకువచ్చిన టోఫెల్‌ను కూడా బోధించకుండా ప్రభుత్వం నిలిపివేసింది. పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మిషన్‌ను వినియోగంలోకి తీసుకురాకుండా ఒక మూలన పడేశారు.

డెప్యుటేషన్‌పై ఉపాధ్యాయులు.. సింగిల్ టీచర్లతో కాలక్షేపం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరగకపోవడంతో వందకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలు పాఠశాలల్లో సింగిల్ టీచర్లతో బోధన జరుగుతోంది. గంపలగూడెం మండలంలోని మూడు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఇతర పాఠశాలల నుంచి డెప్యుటేషన్‌పై నియమించారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు ఇంకా కొన్ని పాఠశాలల్లో చేరవలసి ఉంది. తిరువూరు మండలంలో 160 పోస్టులకు గాను టీచర్ల సర్దుబాటు అనంతరం ఐదు ఖాళీలు ఉన్నాయి. గంపలగూడెం మండలంలో 145 పోస్టులుండగా 107మంది పనిచేస్తున్నారు. విస్సన్నపేట మండలంలో 122 ఉపాధ్యాయ పోస్టులకు గాను 109 మంది మాత్రమే ఉన్నారు. ఎ.కొండూరు మండలంలో 170 పోస్టులకు గాను 150 మంది పనిచేస్తున్నారు. ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన స్కూళ్లలో కొత్త పోస్టులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులపై పనిభారం అధికమవుతోంది. సబ్జెక్టు టీచర్ల నియామకం జరపాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

విద్యా కిట్ల కొరత

తిరువూరు నియోజకవర్గంలో గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన విద్యా కానుక కిట్లను పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసినప్పటికీ కొత్తగా చేరే విద్యార్థులకు ఈ కిట్లు ఇంకా అందలేదు. ప్రవేశాలకనుగుణంగా విద్యార్థులకు కావలసిన బ్యాగులు, పుస్తకాలు, బూట్లు, ఇతర విద్యా సామగ్రి కోసం ఇండెంట్ పంపినప్పటికీ పాఠశాలలకు సరఫరా చేయకపోవడంతో తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు రెండు వేల మందికి ఈ కిట్లు అందలేదు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

నూజివీడు నియోజకవర్గంలోని మండలాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కూడా వేధిస్తోంది. పిల్లలు తక్కువ, ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ పేరుతో తక్కువ ఉపాధ్యాయులున్న పాఠశాలలకు సర్దుతున్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నిర్వహిస్తున్నారు. అయితే నూజివీడు మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 17 వరకు ఉన్నాయి. వాటిల్లో పిల్లల సంఖ్య కూడా పదిలోపే ఉంది. విద్యా కిట్లను ప్రజాప్రతినిధులో, అధికారులో పంపిణీ చేయాల్సి ఉండగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాఠశాలల హెచ్‌ఎంలు పంపిణీ చేయిస్తున్నారు. తామే పంపిణీ చేస్తామని కూటమి నాయకులు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా కొనసాగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు అధికార పార్టీ నాయకుల జోక్యానికి నిలయంగా మారాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల సంఖ్య తగ్గింది



ప్రభుత్వ పాఠశాల విద్యను గత ప్రభుత్వం గాడిలో పెట్టింది. కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌లకు మేలు చేసే విధంగా నిర్ణయాలను తీసుకుంటోంది. గత ఏడాది కన్నా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం సిగ్గుచేటు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి. – యర్రగుంట సుకుంద్, వెలగలేరు గ్రామం, జి.కొండూరు మండలం

తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారు



తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇస్తామన్నారు. మా ఇద్దరి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. నాకు రూ.30 వేలు వస్తాయి. గత ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో ఖచ్చితంగా ఇచ్చింది. ఈ ప్రభుత్వం కూడా వెంటనే పథకాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి. – మరీదు విజయకుమారి, కుదప గ్రామం, రెడ్డిగూడెం మండలం

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో బోధన కుంటుపడుతోంది. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలి. సింగిల్ టీచర్లున్న పాఠశాలలకు రెండో ఉపాధ్యాయుడిని నియమించాలి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల పోస్టులు మంజూరు చేయాలి. – షేక్ నాగుల్‌మీరా, తిరువూరు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు మేకా ప్రతాప్ పరామర్శ



ముసునూరు: కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. కాట్రేనిపాడుకు చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త బేతపూడి నాగేశ్వరరావు ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడగా, చేయి విరగడంతో చికిత్స పొందాడు. శనివారం రాత్రి మండల పార్టీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నాగేశ్వరరావు ఇంటికి వెళ్లిన ఆయన బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, సొసైటీ అధ్యక్షుడు రాజాప్రసాద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కంబాల రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కండి

సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్



తిరువూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ కార్యకర్తలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో ఆదివారం నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే పంచాయతీ ఎన్నికల నాటికి పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. స్థానిక సమస్యలను ఎప్పటికపుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలని, తద్వారా పార్టీకి ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. వెంటనే వార్డు, గ్రామ, మండల, పట్టణ కమిటీలను ఏర్పాటు చేయాలని శంకర్ సూచించారు. పార్టీ, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ'

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని ఆర్డీఓ వై.భవానీశంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అధికారులకు అర్జీలను అందిస్తే, వాటి పరిష్కారానికి పేర్కొన్న గడువులోగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విశ్వకర్మ భగవాన్ మాల ధారణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శ్రీమద్విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం కొండపల్లి శ్రీగిరి వీరేశ్వర విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం జరుగుతుందని మద్దు వెంకట రామలింగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో మొదటి సారిగా శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్, కామాక్షి అమ్మవార్ల సన్నిధిలో భక్తులు మాల ధారణ స్వీకరిస్తారని చెప్పారు. ముఖ్య అతిథిగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 8వ తరం మునిమనవడు నొస్సం వీరంభట్లయ్య హాజరవుతారన్నారు. సెప్టెంబర్ 17న మాల విరమణ చేస్తారని చెప్పారు. ఆలయం వద్ద మాలధారణ చేసిన భక్తులకు ప్రతి రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భిక్ష, రాత్రి అల్పాహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమం నిర్వాహకులుగా కత్తురోజు రామకృష్ణ వ్యవహరిస్తారని తెలిపారు.

గురువుకు పూర్వ విద్యార్థుల సత్కారం



ఇబ్రహీంపట్నం: తెలుగు ఉపాధ్యాయుడిగా 36 ఏళ్ల పాటు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పోలకొండ శ్రీనివాసరావును పూర్వ విద్యార్థులు సత్కరించారు. విజయశక్తి విద్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శాలువా, పూలమాలతో ఆయనను సత్కరించి మెమొంటో, సన్మాన పత్రం అందజేశారు. తెలుగుతో పాటు సంస్కారం నేర్పిన గురువుకు కృతజ్ఞతలు తెలిపారు. సహ ఉద్యోగులు, పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహారావుపాలెంలో ఫాగింగ్

చాట్రాయి: నరసింహారావుపాలెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. సి.గుడిపాడు, నరసింహారావుపాలెం, పిట్లవారిగూడెం గ్రామాల్లోని అన్ని కాలనీల్లో ఫాగింగ్ నిర్వహించారు. సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ మండపాటి రఘుపతిరెడ్డి, సీతయ్య, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో వంతెన నిర్మాణం పూర్తి



మేకా ప్రతాప్ అప్పారావును సత్కరిస్తున్న గొల్లపల్లి పెద్దలు



గొల్లపల్లిలో ఉరవ కాల్వపై నిర్మించిన నూతన వంతెన

మేకా ప్రతాప్ అప్పారావుకు గ్రామస్తుల సత్కారం

నూజివీడు: మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును ఆదివారం గొల్లపల్లికి చెందిన పలువురు రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. దాదాపు దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉరవ కాలువపై వంతెన నిర్మాణాన్ని ఆయన పూర్తి చేయించారు. దీనికి గాను ప్రభుత్వం నుంచి రూ.40 లక్షలు మంజూరు చేయించి, నిర్మాణాన్ని పూర్తి చేయించి రైతుల ఇబ్బందులను తొలగించిన మేకా ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పంట ఉత్పత్తుల తొలగింపునకు తొలగిన ఇబ్బందులు..

ఈ వంతెన నిర్మాణం వల్ల వేలాది ఎకరాల్లోని వ్యవసాయ భూముల వద్దకు రాకపోకలు చేయడానికి, పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు ఇబ్బందులు తొలగిపోయాయని రైతులు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ మేరుగ లెనిన్, ఉప సర్పంచ్ రెడ్డి మధుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తటకలూరి రంగారావు, చల్లారి వెంకట రామయ్య, పామర్తి రాంబాబు, యలర్తి నర్సయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

దశాబ్దకాల సమస్యకు పరిష్కారం

గొల్లపల్లిలోని ఉరవ కాలువపై ఉన్న చప్టా 2013లో వచ్చిన తుపానుకు కొట్టుకుపోయింది. దీంతో రైతులు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుని అప్పటి నుంచి ఇబ్బందులు పడుతూ వ్యవసాయ భూముల్లోకి రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు మూడు వేల ఎకరాల వ్యవసాయ భూముల్లోకి ఈ మార్గం గుండానే రైతులు రాకపోకలు సాగించాల్సి ఉంది. వర్షాకాలంలోను, తుపాన్ల సమయంలో వెళ్లడానికి వీలు లేక మీర్జాపురం మీదుగాగాని, దేవరగుంట మీదుగా గాని 10 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. వ్యవసాయ ఉత్పత్తులను ఇళ్లకు తెచ్చుకునేందుకు సైతం రైతులు పడరాని పాట్లు పడేవారు. పశువులను, మేకలను తోలుకెళ్లడానికి సైతం ఇబ్బందులు పడేవారు. 2014 నుంచి 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వంలో ఈ సమస్యను ఎన్నిమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలను మంజూరు చేసింది. ఆ నిధులతో వెంటనే టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌ను నిర్ణయించి వంతెన నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయించారు. వంతెనకు రెండు వైపులా అప్రోచ్ రోడ్డులను సైతం నిర్మించి రాకపోకలకు సిద్ధం చేశారు. దీంతో గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు వంతెన నిర్మాణానికి ఎంతగానో కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌ను సత్కరించారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి



నరసింగపాలెంలో ప్రతాప్ అప్పారావును కలిసిన రైతులు

ఆగిరిపల్లి: వర్షాలు లేక వరి నారుమడులు ఎండిపోతున్నాయని, వెంటనే సాగర్ జలాలు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని నరసింగపాలెంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావును ఆదివారం పలువురు రైతులు కలిసి వర్షాలు లేక నారుమడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో సరైన వర్షాలు పడక, చెరువుల్లో నీళ్ల లేక ఇప్పటికే వేసిన నారుమడులు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం, అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని సకాలంలో విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి హరిబాబు, గొల్ల ఇస్సాకు, ఉపాధ్యక్షురాలు సుజనా కుమారి, సర్పంచ్ అనూష, పురుషోత్తం, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ



నూజివీడు: చెట్లను సంరక్షిస్తే అవి మనలను రక్షిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగోటౌన్ అధ్యక్షులు దోనేపూడి నరేంద్రకుమార్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతీ ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆదివారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేయడం వల్ల వాతావరణంలో కాలుష్యం పెరిగి రోజురోజుకు భూగోళం వేడెక్కుతోందన్నారు. దీని వల్ల అనేక దుష్ఫలితాలు సంభవించి మానవజాతి మనుగడకు తీవ్ర హాని కలుగుతోందని చెప్పారు. వీటన్నింటి నుంచి రక్షణ కావాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె. సత్యనారాయణ, సభ్యులు యార్లగడ్డ రాజగోపాల్, పైడి అనిల్‌కుమార్, గొల్లపూడి రవిబాబు, మలిశెట్టి శ్రీనివాస్, మండా శ్రీను పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో ఉద్యాన శాఖ రాయితీలు

విస్సన్నపేట: మండలంలోని ఉద్యాన శాఖ నుంచి రావాల్సిన రాయితీలను రైతుల ఖాతాలో జమ చేశామని మండల ఉద్యాన అధికారి నరేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. ఆర్‌కేవీవై ఆయిల్ పామ్‌కు సంబంధించి రాయితీలు 2023–24కి హెక్టార్‌కు మొక్కలకుగాను రూ.11,040, ఎరువులకు హెక్టార్‌కు రూ.5,250, మొత్తం రూ.16,300 రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మామిడి, బొప్పాయి, అరటి పంటలు వేసిన రైతులకు కూడా వారి ఖాతాల్లో రాయితీలు జమ చేశామని చెప్పారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి కొత్తగా మామిడి, అరటి, బొప్పాయి వేసే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. డ్రిప్ సేద్యం కావాల్సిన రైతులు ఐదు ఎకరాల లోపు వారికి 90 శాతం రాయితీ, ఐదు ఎకరాలకు పైగా ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఇతర వివరాలకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

పూడికతీతకు రూ.26 లక్షల మంజూరు



తిరువూరులో డ్రెయిన్లను శుభ్రం చేస్తున్న పొక్లెయిన్

తిరువూరు: తిరువూరు పట్టణంలో పక్కా డ్రెయినేజీలలో పూడికతీతకు ప్రభుత్వం రూ.26 లక్షలు మంజూరు చేసిందని నగర పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ నిధులతో మెయిన్‌రోడ్డులో రాజుపేట నుంచి బైపాస్ రోడ్డు వరకు ఇరువైపులా డ్రెయినేజీలో పూడిక తీస్తామని చెప్పారు. డ్రెయినేజీలను ఆక్రమించి పలువురు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయగా వాటిని వెంటనే తొలగించాలని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు ఇటీవల ఆదేశించారు. కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగా డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగిస్తున్నారు. వర్షాకాలంలో డ్రెయినేజీలలో నీరు పోయే మార్గం లేక రోడ్లపై పారుతుండటం, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి, దుకాణాలు, దేవాలయాల్లోకి నీరు చేరుతోంది. డ్రెయిన్లను శుభ్రం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నందున నగర పంచాయతీ చర్యలు చేపట్టింది.

మందా కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

ముసునూరు: మండలంలోని లోపూడిలో నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు దుబ్బాకు దేవరాజు అధ్యక్షతన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్, గ్రామ పెద్దలు తిరుపతయ్య, కృష్ణ, శ్రీనివాసరావు, యువకులు పాల్గొన్నారు.



నేడు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం

నూజివీడు: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని సంఘ ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశంలో సంఘ సభ్యుల సమస్యలు, ప్రభుత్వ పరంగా ఉన్న సమస్యలు, సెప్టెంబర్ ఐదున ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంపై చర్చిస్తామన్నారు.

9న శ్రీలక్ష్మమ్మ అంకమ్మ దేవతల ఆలయ ప్రతిష్ఠ




చాట్రాయి: ఆరుగొలనుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మమ్మ, అంకమ్మ దేవతల ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 9న జరుగుతుంది. ఈ సందర్భంగా 7వ తేదీ ఉదయం గణపతి పూజ, నీరాజన మంత్రపుష్పం, 8న శాంతి హోమం, గణపతి పూజ, కుంకుమార్చన, 9న ఉదయం 9.36 గంటలకు అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ, 11 గంటలకు అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవార్డులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండస్ట్రియల్ పార్క్‌కు పలు విభాగాల్లో అవార్డులు దక్కాయి. విజయవాడలో ఆదివారం జరిగిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో కొండపల్లి లయన్స్ క్లబ్ ఇండస్ట్రియల్ పార్క్ శాశ్వత ప్రాజెక్టులు, వివిధ సేవా కార్యక్రమాలను గుర్తించిన సంస్థ పెద్దలు అవార్డులు అందజేశారు. మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శంకర్‌గుప్తా చేతుల మీదుగా స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి అవార్డులు అందుకున్నారు. కార్యదర్శి సురేష్, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్లు బి.కృష్ణారెడ్డి, ఎస్. బుల్లిరాజచౌదరి, సీహెచ్ వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి దాతల విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురంలోని దాసాంజనేయ స్వామి ఆలయానికి ఇరువురు దాతలు విరాళం ఇచ్చారు. జక్కేపల్లి జయసింహ ప్రసాద్ రూ.35 వేలు, వడ్రాణపు రమణమూర్తి రూ.25 వేలు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు ఆదివారం అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సంకా రాంబాబు, కొల్లిపర సుబ్బారావు, ఆలయ అర్చకులు మరింగంటి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా కిషోర్



చాట్రాయి: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా చనుబండ గ్రామానికి చెందిన నడిపల్లి కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చాట్రాయి గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా గౌరవరపు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా చవ్వా నారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రతికంటి రామచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.చిన సత్యంబాబు, మండల ఆర్యవైశ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.